


సగానికి విరిగిపోయిన ప్రవేశ మార్గం గేటు

అసంపూర్తిగా పార్కు

- పేరుకుపోయిన తుప్పలు, పిచ్చి మొక్కలు
- ఆనవాళ్లే లేని వాకింగ్ ట్రాక్
- తుప్పు పట్టిన క్రీడా పరికరాలు


తుప్పలతో అధ్వానంగా పార్కు పరిసరాలు

భీమునిపట్నం: అసంపూర్తి పనులతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. ఇందుకు బీచ్ రోడ్డులో సగం వరకు పనులు జరిగి, ఆగిపోయిన పార్కు నిర్మాణమే నిదర్శనం. నేరెళ్లవలస కాలనీకి వెళ్లే మార్గానికి కొద్ది దూరంలో రోడ్డు పక్కన విశాలమైన స్థలం ఉండడంతో ఎనిమిదేళ్ల క్రితం రూ.10 లక్షలతో పార్కు ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయించారు. దీనికోసం ఈ స్థలాన్ని చదును చేసి, చుట్టూ ఇనుప కంచె వేసి, గేటు నిర్మించారు. పార్కులో వ్యాయామం చేసుకునేందుకు పరికరాలు, వాకర్ల కోసం వాకింగ్ ట్రాక్‌నూ ఏర్పాటు చేశారు. ఇంకా పిల్లలు ఆడుకోవడానికి పలు పరికరాలతో పాటు లైటింగ్, బెంచీలు, ఫౌంటెన్ తదితర సదుపాయాలను కల్పించవలసి ఉండగా, సగంలో వదిలేశారు. దీంతో పార్కు వినియోగంలోకి రాలేదు.

నిర్వహణ లేకపోవడంతో క్రమంగా తుప్పలు, పిచ్చి మొక్కలు బాగా పెరిగిపోయాయి. అయితే వ్యాయామ పరికరాలు ఉండడంతో కొందరు వ్యాయామం చేయడానికి కొంతకాలం వచ్చినా, తరువాత మానేశారు. దీంతో అవీ దెబ్బ తింటున్నాయి. రాత్రివేళల్లో మందుబాబులు మద్యం సేవిస్తున్నారు. పార్కు ప్రవేశమార్గంలోని గేటు సగం వరకు విరిగిపోయింది. దీంతో పేరుకే పార్కుగా మిగిలింది తప్ప ఆ ఆనవాళ్లేవీ కనిపించడం లేదు. పార్కు నిర్మాణం పూర్తయి ఉంటే సమీపంలోని నేరెళ్లవలస కాలనీ, ఎగువపేట చుట్టుపక్కల ఉండేవారికి ఎంతో సదుపాయంగా ఉండేది. కాని ఆ అవకాశం లేకుండా పోయింది.

ప్రభుత్వం మారడంతో..
గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ బీచ్ వద్ద ఉన్న పార్కులతో పాటు, తగరపువలస రోడ్డులోని జమ్మిచెరువు పార్కును రూ. కోటితో ఆధునీకరించారు. ఇక్కడి పార్కును మళ్లీ నిర్మించాలని అధికారులు భావించారు. కానీ ప్రభుత్వం మారడంతో పనులు జరగలేదు. అధికారులు స్పందించి పార్కును వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.


నడవడానికి పనికిరాని వాకింగ్ ట్రాక్

దగ్గరలోనే పార్కు అని ఆనందపడ్డాం



మాకు బీచ్ పార్కు దూరం. అందరం వెళ్లడం కష్టమవుతోంది. ఇక్కడ పార్కు ఏర్పాటవుతోందని తెలిసి చాలా ఆనందపడ్డాం. దగ్గరలో పార్కు వస్తుంది, పిల్లలకు, పెద్దలకు చాలా బాగుంటుంది అనుకున్నాం. అది సగంలోనే ఆగిపోయింది. ఇప్పటికైనా పార్కు పూర్తి చేయాలి.
–అడిదం సన్యాసిరాజు, నేరెళ్లవలస కాలనీ, భీమిలి

వినియోగంలోకి తేవాలి



ఈ పార్కు మా ప్రాంతానికి చాలా దగ్గర. పిల్లలతో పాటు అందరూ వెళ్లి సరదాగా గడపడానికి ఎంతో బాగుంటుంది. ఇది వినియోగంలోకి వస్తుందని అందరం భావించాం. కానీ మధ్యలోనే ఆగిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కును పూర్తి చేయాలి.
– వాసుపల్లి అమ్మాజీ, ఎగువపేట, భీమిలి

లింగ వివక్షకు పాల్పడడం నేరం

- డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి
- పద్మనాభంలో ప్రచార ర్యాలీ


పద్మనాభంలో ర్యాలీ నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు, అధికారులు

పద్మనాభం: లింగ వివక్షకు పాల్పడడం నేరమని డీఆర్‌డీఏ పీడీ బి.లక్ష్మీపతి అన్నారు. పద్మనాభంలోని జెండర్ రిసోర్సు కేంద్రంలో సోమవారం సాయంత్రం లింగ వివక్షపై ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మగ పిల్లలతో పాటు ఆడ పిల్లలను సమానంగా చదివించాలని సూచించారు. ప్రచారంలో భాగంగా ప్రతి గ్రామంలో గ్రామ సంఘాల ద్వారా బాల్య వివాహాలు అరికట్టడం, మహిళల పట్ల జరుగుతున్న గృహ హింస, వేధింపులను నివారించడానికి ఉన్న చట్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు. హింసకు గురైన మహిళలు, పిల్లలకు అత్యవసర సమయాల్లో మండల సమాఖ్య ఆధ్వర్యంలో పద్మనాభంలో ఏర్పాటు చేసిన మోడల్ జెండర్ రిసోర్సు కేంద్రంలో సహాయం అందిస్తామని తెలిపారు. వీరికి వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి రక్షణ కల్పించడం, వైద్య సేవలు, పోలీసులకు ఫిర్యాదు చేయడంలో సహాయం, న్యాయ సేవలు అందిస్తారన్నారు. ఈ సందర్భంగా లింగ వివక్షకు పాల్పడకూడదని ర్యాలీ, మానవ హారం, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, తహసీల్దార్ కె.ఆనంద్ కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి ఉమ, వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ సత్యం నాయుడు, ఏపీఎంలు సాయి రమేష్, ప్రభాకర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఆయుర్వేదాన్ని చేరువ చేస్తాం

- ఆయుష్ విభాగం ఆర్‌డీడీ ఝాన్సీ లక్ష్మీభాయ్
- నేటి నుంచి ప్రకృతి పరిరక్షణ అభియాన్



మధురవాడ: ప్రతీ ఇంటికి ఆయుర్వేదాన్ని చేరువ చేసేందుకు 'దేశ్ కా ప్రకృతి పరిరక్షణ అభియాన్' పేరిట ఈ నెల 26వ తేదీ నుంచి డిసెంబర్ 25వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయుష్ విభాగం రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఝాన్సీలక్ష్మీభాయ్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విశాఖ విజయనగరం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాల్లోని ఆయుష్ విభాగం ఆయుర్వేద డాక్టర్ల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు, ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి వీధి నాటకాలు, ర్యాలీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మార్మోగిన అయ్యప్ప శరణుఘోష


పూజలో పాల్గొన్న మాలధారులు

పీఎం పాలెం: ఆరోవార్డు పీఎం పాలెంలోని లక్ష్మీవానిపాలెంలో అయ్యప్ప స్వామి అంబలం పూజను సోమవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. స్వామి ఆలయ నమూనా నిర్మించి, 18 మెట్లు ఏర్పాటు చేశారు. స్వాముల శరణుఘోషతో ఆ ప్రాంతం మార్మోగింది. స్థానిక నాయకుడు పోతిన ప్రసాద్, వందలాది మంది మాలధారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదలకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు అందిస్తున్న చంద్రావతి

భీమునిపట్నం: స్థానిక కళాసాహితి సభ్యురాలు ఉశిరికల చంద్రావతి పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. తోటవీధి వద్ద జరిగిన కార్యక్రమంలో 50మందికి వీటిని అందించారు. ఆమె మాట్లాడుతూ చలికాలంలో వారికి ఉపయోగపడతాయని వీటిని అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాసాహితి అధ్యక్షుడు పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ పాల్గొన్నారు.

ఎక్సైజ్ సిబ్బందిపై కలెక్టర్‌కు ఆర్మీ ఉద్యోగి ఫిర్యాదు

తగరపువలస: భీమిలి మండలం మూలకుద్దు పంచాయతీకి చెందిన ఆర్మీ ఉద్యోగి ఎరుసు వెంకటరెడ్డి భీమిలి ఎక్సైజ్ సిబ్బందిపై కలెక్టరుకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఆర్మీ ఉద్యోగులైన తాను, తన తమ్ముడు గురయ్యరెడ్డి సెలవుపై ఇంటికి వచ్చామన్నారు. వచ్చేటప్పుడు అథారిటీ లెటరుతో పాటు కోటాపై వచ్చిన మద్యం బాటిళ్లు తెచ్చుకున్నామని తెలిపారు. ఇవే కాకుండా 2021 నుంచి విడిపించుకున్న మద్యం బాటిళ్లు కొన్ని ఇంట్లో ఉన్నాయన్నారు. ఈ నెల 17న ఎక్సైజ్ సిబ్బంది తమ ఇంటికి వచ్చి, తమ కుటుంబ సభ్యులను బెదిరించి 17 మద్యం బాటిళ్లు తీసుకుపోయారని తెలిపారు. ఖాళీ పేపర్లపై సంతకాలు చేయించుకుని మహిళలను వేధిస్తున్నారన్నారు. విషయం తేల్చకుండా మహిళలను రోజూ స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు సీసీ పుటేజీతో కలిపి ఫిర్యాదు చేసినట్లు వెంకటరెడ్డి తెలిపారు.

ముగిసిన దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న దుర్గాలమ్మ ఆలయ 14వ వార్షికోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి.. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, కుంకుమ పూజ, మండపారాధన తదితర పూజలు చేశారు. అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మొకర అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

కొనసాగుతున్న క్రీడా పోటీలు


ఉత్సాహంగా సాగుతున్న వాలీబాల్ పోటీలు

కొమ్మాది: బిర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకుని జన జాతీయ గౌరవ దివస్ వేడుకల్లో భాగంగా రుషికొండ గాయత్రి పీజీ, డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న పలు పోటీలు సోమవారం ఉత్సాహంగా సాగాయి. విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాస రచన, వ్యక్తృత్వ పోటీలు నిర్వహించారు. అలాగే ఆర్చరీ, జావెలిన్ త్రో, వాలీబాల్ పోటీలు పోటాపోటీగా సాగాయి. పోటీలను గిరిజన సాంస్కృతిక పరిశోధనా శిక్షణ మిషన్ ఈడీ డా.రాణి మందా పర్యవేక్షించారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

తగరపువలస: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీలలో చిత్తూరు జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో ఆనందపురం విద్యార్థులు రజత, కాంస్య పతకాలు సాధించారు. అండర్–19 విభాగంలో ప్రణయ్‌కుమార్ కాంస్యం, కె.పవన్‌కుమార్ రజత పతకం సాధించారు. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన వీరిని కోచ్ అప్పలరాము, గణేష్, వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

జీతాలు ఇవ్వాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

భీమునిపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు మంగశ్రీ డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం పారిశుధ్య కార్మికులు నిర్వహించిన ఆందోళనలో ఆమె పాల్గొని, మాట్లాడారు. ఐదు నెలలుగా వీరికి వేతనాలు రాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అసలే అంతంతమాత్రంగా జీతాలు, అవి కూడా సమయానికి ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. నిత్యావసర సరకుల ధరలు భారీగా పెరగడంతో కష్టంగా బతుకులు సాగుతున్నాయని, ఇప్పుడు వేతనాలు కూడా రాకపోవడంతో వారు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్మికులు సత్యవతి, ఆదిలక్ష్మి, బంగారమ్మ, రత్నమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభం


విష్వక్సేనుడికి పూజలు చేస్తున్న ఆగమ అడ్వైజర్ వేణుగోపాల్ దీక్షితులు, వేద పండితులు


కొమ్మాది: రుషికొండలో తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ద్వితీయ పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలకు సోమవారం సాయంత్రం అంకురార్పణ చేశారు. సకల దేవతలను పవిత్రోత్సవాలకు ఆహ్వానించే క్రమంలో ముందుగా విష్వక్సేనుడికి పూజలు చేశారు. అనంతరం అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం పవిత్రాల ప్రతిష్ట, 27వ తేదీన మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు పవిత్రాల సమర్పణ, 28న సాయంత్రం 6గంటల నుండి 8 గంటల వరకు పూర్ణాహుతి నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు ఉదయం 10–30 గంటల నుంచి 11–30 గంటల వరకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమ అడ్వైజర్ వేణుగోపాల్ దీక్షితులు, ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు, సూపరింటెండెంట్ వెంకటరమణ, వేద పండితులు, ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన కోసం కలెక్టర్‌కు వినతి


కలెక్టరేట్‌లో వినతిపత్రం అందిస్తున్న బీసీ సంఘం ప్రతినిధులు

తగరపువలస: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ స్థాయిలో నిర్వహించ తలపెట్టిన జనగణనతో పాటు సమగ్ర కులగణన జరిపించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందించింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ని శ్రీనివాసరావు మాట్లాడుతూ 1931లో బ్రిటిష్ ఇండియా జరిపించిన జనగణనలో సమగ్ర కులగణన తప్ప, తరువాత స్వతంత్ర భారతావనిలో ఏ ప్రభుత్వం జరిపించలేదన్నారు. దేశ జనాభాలో 52 శాతం ఓబీసీలు ఉన్నారని వారికి ఎస్సీ, ఎస్టీల వలె దామాషా పద్ధతిలో విద్య, ఉద్యోగం, చట్టసభలు, బడ్జెట్, సంక్షేమ పథకాలలో ప్రాధాన్యం, రాయితీలు కల్పించాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో సంఘం ప్రతినిధులు పల్ల శ్రీను, కె.వెంకట సుబ్బారావు, జి.శ్రీనివాసనాయుడు, నరేష్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

గంభీరంలో రేపటి నుంచి లక్ష దీపోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న శ్యామ మాధవ దాస

దాబాగార్డెన్స్ : హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో గంభీరంలో గల అక్షయపాత్ర ఫౌండేషన్ వంటశాల పక్కన హరే కృష్ణ వైకుంఠ మందిర నిర్మాణ ప్రాంగణంలో లక్ష దీపోత్సవం ఈ నెల 27 నుంచి డిసెంబర్ 1 వరకు నిర్వహించనున్నట్లు హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి శ్యామ మాధవ దాస తెలిపారు. సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా ఆకాశ దీపం, తొలి దీపం, సాంస్కృతిక కార్యక్రమాలు, దామోదర హారతి, భక్తులచే దీపోత్సవం, ప్రసాద వితరణతో పాటు శ్రీభగవానుని ఆరాధన ఉంటుందన్నారు. ఆరాధనలో ప్రతి రోజూ శ్రీకృష్ణుని ఆలయాన్ని సందర్శించాలని, నెయ్యి దీపం అర్పించాలని, దామోదర అష్టకాన్ని ప్రతి రోజు పాడాలని, దానం చేయాలని, తులసీ దేవికి పూజ చేయాల్సి ఉంటుందన్నారు. నెయ్యి దీపంతో శ్రీకృష్ణుని ఆరాధించడం కార్తీక మాసంలో అత్యంత ముఖ్యమైనదిగా పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 90106 11108 నంబరులో సంప్రదించవచ్చని తెలియజేశారు.

అనారోగ్యంతో వీఆర్వో మృతి

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కుమ్మరిపాలెం వీఆర్వో గుర్ల అప్పారావు (55) సోమవారం మృతి చెందారు. భీమిలి బోయివీధికి చెందిన అప్పారావు అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ ఇంటి వద్ద మరణించారు. ఆయన మృతిపై తహసీల్దారు పి.రామారావు, డీటీ శ్రీనుబాబు, సిబ్బంది సంతాపం తెలిపారు.

నీలకంఠుడికి నీరాజనం


బసవేశ్వరునికి అభిషేకం చేస్తున్న శివస్వామి


చోడేశ్వరస్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

కార్తీకమాసం నాలుగో సోమవారం సందర్భంగా శివాలయాలు మహాదేవుని నామస్మరణతో మార్మోగాయి. బసవపాలెంలో బసవేశ్వరునికి దివ్యాంగుడైన శివయ్యస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు చేతులు లేకపోయినా ఆయన చేసిన పూజలు, అభిషేకాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 12వేల మందికి మహా అన్నసమారాధన నిర్వహించారు. దివీస్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొన్నారు. చోడేశ్వరస్వామి ఆలయంలో స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. కారుషెడ్ శివాలయం, శృంగేరీ పీఠంలోని శివాలయంలో మఠం గౌరవ ధర్మాధికారి జగర్లమూడి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేశారు. జోన్–2 జెడ్సీ సింహాచలం ఆలయంలో అభిషేకం చేశారు. బబ్బేలమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నసమారాధనలో 4వేల మంది పాల్గొని, అన్న ప్రసాదం స్వీకరించారు. – తగరపువలస/ భీమునిపట్నం/ పీఎం పాలెం


చోడేశ్వర స్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు


బబ్బేలమ్మ ఆలయం వద్ద అన్న సమారాధన


టి.నగరపాలెం శివాలయంలో భక్తుల పూజలు


కారుషెడ్ శివాలయం వద్ద బారులు తీరిన భక్తులు


బసవపాలెంలో భారీ అన్నసమారాధన

650 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పీఎం పాలెం: జీవీఎంసీ 6వ వార్డు పరిధి పీఎం పాలెంలోని కమ్యూనిటీ హాల్లో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నగరానికి చెందిన మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని జోన్–2 జెడ్సీ సింహాచలం ప్రారంభించారు. పీఎం పాలెం పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన 650 మందికి డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు బీపీ, షుగర్, ఈసీజీ, పాప్‌స్మియర్ తదితర పరీక్షలు చేశారు. శిబిరంలో గైనకాలజిస్ట్ డాక్టర్ జి.లక్ష్మీ కొండమ్మ, కార్డియాలజిస్ట్ డాక్టర్ అశ్విన్ కుమార్ పాండా, అంకాలజిస్ట్ డాక్టర్ అభిలాష్ గవరాజు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు 18 వినతులు


భీమిలి జోనల్ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ ప్రేమ ప్రసన్న వాణి

మధురవాడ : జీవీఎంసీ జోన్–2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో 18 వినతులు అందాయి. జోనల్ కమిషనర్ సింహాచలం వినతులు స్వీకరించారు. జీవీఎంసీ 5వ వార్డు కొండవాలు ప్రాంతం స్వయంకృషి నగర్‌లో శిథిలావస్థకు చేరుకున్న మంచినీళ్ల ట్యాంకును తొలగించాలని, మంచి నీటి సరఫరాకు పైపు లైన్ ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరారు. ముందుగా ఇంటి పన్ను వేయాలని వినతిపత్రం అందజేశారు.

- మధురవాడలో ఏడాకుల చెట్లు అధికంగా ఉన్నాయని, వీటి కారణంగా శ్వాస కోశవ్యాధులు వస్తున్నాయని వాటిని తొలగించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నాయకుడు పిళ్లా సూరిబాబు వినతి పత్రం అందించారు.
- మానం ఆంజనేయులు కాలనీలో నకిలీ పట్టాలు సృష్టించి చేపట్టిన నిర్మాణాలపై దర్యాప్తు చేయాలని టీడీపీ నాయకుడు పిళ్లా వెంకటరావు కోరారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జెడ్సీ అధికారులను ఆదేశించారు.

భీమిలిలో రెండు వినతులు
భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రెండు వినతులు వచ్చాయి. వాటిని జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణి స్వీకరించారు. త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కూటమి ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలి


ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

మధురవాడ: పట్టణ పేదలకు రెండు సెంట్ల స్థలం ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ఆ హామీని నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. జీవీఎంసీ 7వ వార్డు కళానగర్ వద్ద సోమవారం చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో పేదలకు పట్టణాల్లో ఒక సెంటు చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చారని, చాలామందికి ఇంకా స్థలాలు చూపాల్సి ఉందని చెప్పారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇస్తామని హామీ ఇచ్చారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ విషయం మరిచిపోయారని గుర్తు చేశారు. వెంటనే హామీ అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.